ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 మహబూబాబాద్

గురువారం 24 ఏప్రిల్ 2025





◀ మానుకోటలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

దంచికొడుతున్న ఎండలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 42.7 డిగ్రీల నమోదు

8



బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఎల్కతుర్తిలో సిద్ధమవుతున్న స్థలం



పాతికేళ్ల గులాబీ..

ఉద్యమపార్టీకి ఓరుగల్లు జనం నీరాజనం

- 2004లో తొలిసారి ఎన్నికల బరిలోకి..
- ఆరుగురిని ఎమ్మెల్యేలుగా, ఇద్దరిని ఎంపీలుగా గెలిపించిన ఓటర్లు
- 2023 వరకు ప్రతీ ఎన్నికల్లో ప్రభంజనమే..
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుస ఓటములు
- చెక్కు చెదరని క్యాడర్ ఉందనే ధీమాలో అధినాయకత్వం
- శ్రేణుల్లో జోష్ నింపేలా వరంగల్ కేంద్రంగా రజతోత్సవం
- ఆవిర్భావ సభను అట్టహాసంగా నిర్వహించేలా ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

గులాబీ పార్టీ రజతోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 27న ఎల్కతుర్తి వేదికగా లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. 2001లో టీఆర్ఎస్ పార్టీగా ఆవిర్భవించి ఉద్యమ పార్టీగా రెండు దశాబ్దాలు ఓరుగల్లు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంది. 2004లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయగా, ఉమ్మడి వరంగల్ ప్రజలు జైకొట్టారు. అప్పటి నుంచి అడుగడుగునా గులాబీపార్టీకి అండగా ఉంటూ వచ్చిన ఓరుగల్లు ఓటర్లు బీఆర్ఎస్‌గా మారిన ఆ పార్టీకి 2023లో మాత్రం ప్రతికూల తీర్పునిచ్చారు. అయితే రాజకీయంగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఓరుగల్లు గడ్డనే రజతోత్సవాలకు కేంద్రంగా ఎంచుకుంది. ఇటీవల వరుస ఓటముల నుంచి క్యాడర్ దృష్టిని మళ్లించి, శ్రేణుల్లో జోష్ నింపేలా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. లక్షలాది మంది ప్రజలను సమీకరించి సభను సక్సెస్ చేసి క్యాడర్‌లో ఉత్సాహం నింపేలా ప్రణాళికను రూపొందింది.

ఓరుగల్లుపై చెరగని గులాబీ ముద్ర..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన టీఆర్ఎస్ ఓరుగల్లు గడ్డపై తనదైన ముద్ర వేసుకుంది. టీఆర్ఎస్ ఆవిర్భావంలో ఓరుగల్లుకు చెందిన ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు గాదె ఇన్నయ్య, వి.ప్రకాష్ తదితరులు కీలక పాత్ర పోషించారు. ఇక అదే ఏడాది జూలై 12, 15, 17 తేదీల్లో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో జనతాపార్టీకి చెందిన రైతు నాగలి గుర్తుపై తొలిసారిగా ఎన్నికల బరిలో దిగి.. భారీ స్థాయిలో జడ్పీటీసీలను, ఎంపీటీసీలను గెలిచింది. అలాగే ఆగస్టులో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా పట్టిన వారే అధికంగా సర్పంచులుగా గెలుపొందారు. ఊరూరా ఉద్యమకాంక్ష రగులుతుండటం.. యువత కూడా గులాబీ జెండా చేత పట్టుకుని కదం తొక్కడంతో స్థానిక సంస్థల్లో ఆశించిన స్థాయిలో విజయాన్ని నమోదు చేసుకుంది. స్వరాష్ట్రం కోసం టీఆర్ఎస్ పిలుపుతో అనేక వర్గాలు ఉద్యమాల్లోకి వచ్చి చేరాయి. అయితే రాజకీయంగా బలంగా ఉన్నప్పుడే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించవచ్చునని భావించిన కేసీఆర్ 2004లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని గులాబీ జెండా.. కారు గుర్తుతో బరిలో దిగారు. తెలంగాణలో మొత్తం 56స్థానాలకు పోటీ చేయగా.. 26 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. వారిలో ఆరుగురు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారే. 2004లో స్టేషన్‌ఘనపూర్ నుంచి డాక్టర్ గుండె విజయరామారావు, చెన్నూరు (పాలకుర్తి) నుంచి దుగ్యాల శ్రీనివాస్‌రావు, చేర్యాల నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పరకాల నుంచి బండారి శారారాణి, నర్సంపేట నుంచి కంభంపాటి లక్ష్మారెడ్డి, హనుమకొండ నుంచి మందాడి సత్యనారాయణరెడ్డిలను ప్రజలు ఆశీర్వదించారు.

మొత్తం 13అసెంబ్లీ స్థానాల్లో ఆరుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు హనుమకొండ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, వరంగల్ ఎంపీగా రవీంద్రనాయక్ గెలవటంతో ఓరుగల్లులో స్వరాష్ట్ర ఉద్యమానికి ఊపు వచ్చింది. అయితే ఇదే ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు చోట్ల,టీడీపీ రెండు స్థానాల్లో నిలిచాయి. మెజార్టీ స్థానాల్లో టీఆర్ఎస్ పాగా వేయటంతో రాజకీయంగా వరంగల్ గులాబీ కోటగామారింది.

ఎందరికో రాజకీయ జీవితం..

టీఆర్ఎస్ ఆవిర్భావంతో అనేక మంది కాంగ్రెస్, టీడీపీల నుంచి కారు పార్టీలోకి వలస బాట పట్టారు. ఔత్సాహికులు సైతం గులాబీ గూటికి చేరారు. ఈ చేరికలతో పాటు చీలికలను కూడా టీఆర్ఎస్ ఎదుర్కొంది. ప్రధానంగా 2004లో వైఎస్ఆర్ క్యాబినెట్ నుంచి టీఆర్ఎస్ బయటకు వచ్చింది. అయితే కేసీఆర్ నిర్ణయాన్ని వ్యతిరేకించటంతో పాటు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఓరుగల్లు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు ఓటు

మిగతా 7వ పేజీలో...

కేసీఆర్‌కు వరంగల్ సెంటిమెంట్

ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి, వరంగల్



వరంగల్‌పై ప్రేమతోనే రజతోత్సవ సభను కేసీఆర్ వరంగల్‌లో నిర్వహిస్తు న్నారు. వరంగల్‌లో కేసీఆర్ పెట్టిన ప్రతీ సభ సక్సెస్ అయింది. వరంగల్ అంటేనే ఒక ఉద్యమం.. ఒక పోరాటం. నాతో సహ ప్రతీ ఒక్కరు తెలంగాణ కోసం ఎవరి దారి లో వాళ్లు ఉద్యమించిండ్లు. స్వరాష్ట్రంలో 10 ఏళ్ల పాలనలో కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారు. కేసీఆర్‌పై ప్రేమతో స్వచ్ఛం దంగా జనం తరలివచ్చేందుకు సిద్ధమవు తున్నారు. 1,200 ఎకరాల్లో రజతోత్సవ సభకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

వరంగల్‌సభతో రాజకీయాల్లో సంచలనమే..

పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ, వరంగల్



వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తాం. గెలుపోటములను పట్టించు కోకుండా ప్రజల కోసం బీఆర్ఎస్ పని చేస్తోంది. కేసీఆర్ ప్రసంగం కోసం ప్రపంచమే ఎదురుచూస్తోంది. కేసీఆర్, కాంగ్రెస్ పాలన మధ్య తేడాను ప్రజలు గమనించారు. కేసీఆర్ పాలన లేని లోటును గుర్తించారు. మళ్లీ కేసీఆరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటు న్నారు. లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందగా సభకు తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తూ నాయకులకు సూచనలిస్తున్న కేటీఆర్



ఇది సర్కారుపై పోరు కాదు.. పార్టీ పండుగ..

- బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగను జరుపుకుంటున్నాం..
- కాంగ్రెస్ పాలనను ఎండగట్టడం.. బీజేపీ పన్నాగాలు తిప్పికొట్టడమే లక్ష్యం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఎల్కతుర్తిలో నాయకులతో కలిసి బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

7

టీపీసీసీ పరిశీలకులుగా మనోళ్లు..



ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల్లో పలువురి నియామకం

- గాంధీ భవన్‌లో ప్రకటించిన మీనాక్షి నటరాజన్
- మొత్తంగా 11 మందికి పదవులు.. కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

6

మహిళల ఆర్థిక అభివృద్ధే సమాజ ప్రగతి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే ప్రత్యేక పథకాలు
- పావల వడ్డీ రుణాలు ఇవ్వకుండా రూ.3500 కోట్లు ఎగ్గొట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క

కొత్తగూడ, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక అభివృద్ధే సమాజ ప్రగతి అని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టిం దని పేర్కొన్నారు. పావల వడ్డీ రుణాలు ఇవ్వకుండా బీఆర్ఎస్ మహిళలను మోసం చేసిందని, అభయహస్తం డబ్బులను దోచుకుందని ఆరోపించారు. బుధవారం కొత్తగూడలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళశక్తి క్యాంటిన్‌ను ఆమె ప్రారంభించి, టిఫిన్ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న వడ్డీలేని రుణాలతో ఇందిర మహిళ శక్తి ద్వారా ఇందిర శక్తి మహిళ క్యాటిన్‌లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజలు వ్యాపారుల వద్దకు వెళ్లి అధిక వడ్డీతో డబ్బులు తీసుకుని నష్టపోయారని వివరించారు. నేడు ప్రభుత్వం ఇస్తున్న వడ్డీలేని రుణాలతో మహిళలు క్యాంటిన్‌లు, బ్యూటీ పార్లర్‌లు, కిరాణా దుకాణాలు, సోలార్ ప్లాంట్‌లు, పెట్రోల్ బంకులతో పాటు పలు వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని

మిగతా 8వ పేజీలో...



కొత్తగూడలో మహిళ శక్తి క్యాంటిన్‌లో టిఫిన్ చేస్తున్న సీతక్క

నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- జూన్ 12న తెరుచుకోనున్న పాఠశాలలు
- విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందచేత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానున్నాయి. మళ్లీ స్కూళ్లు జూన్ 12న తెరుచుకోనున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో అన్నియాజమాన్య పాఠశాలలు 1,054 ఉన్నాయి. వాటిల్లో 1 నుంచి 9వ తరగతి వరకు 95 వేలకుపైగా విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. కాగా, ఈనెల 9వ తేదీ నుంచి 17 వరకు సమ్మెటివ్ -2 పరీక్షలు నిర్వహించారు. ఏరోజు పరీక్ష పేపర్లను ఆ రోజే మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులు విద్యాసంవత్సరం ముగింపు రోజు బుధవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, వారి సమక్షంలో విద్యార్థుల ప్రోగ్రెస్ (మార్కుల) రిపోర్టులను అందజేశారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు హాజరైన డీఈవో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెంచాలన్నారు.

పర్యాటకులను చంపడం హేయమైన చర్య

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు
- దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ

8



◀ మహబూబాబాద్‌లో అంబేద్కర్ సెంటర్ వద్ద ర్యాలీగా వస్తున్న బీజేపీ నేతలు

WANTED

- కంప్యూటర్ ఆపరేటర్ (Female) మంచి ఇంగ్లీష్, పూర్తి కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం కల్గినవారు
- అకౌంటెంట్ (Male/Female) అకౌంట్స్ & కంప్యూటర్ పరిజ్ఞానం కల్గిన అనుభవం గల వారు కావలెను
- కన్‌స్ట్రక్షన్ వాచ్‌మెన్ & డ్రైవింగ్ వచ్చిన సూపర్‌వైజర్ కావలెను
- వెంచర్‌లో పనిచేయుటకు భార్యా భర్తలు కావలెను

Walk in interview Time: 10 am to 1 pm, 4 pm to 7 pm

సుష్మిత మార్కెటింగ్

Domino's పిజ్జా లైన్, ఫారెస్ట్ ఆఫీస్ ప్రక్కన, శ్రీసాయి కాలనీ, సుబేదారి, హన్మకొండ.

9866242881, 9346997259, 9985012021

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతలకు బహుమతుల అందజేత

మడికొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అక్షరమే అయుధంగా.. దమ్మున్న వార్తలతో ప్రజల పక్షాన నిలుస్తున్న 'ఆంధ్రజ్యోతి'.. 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు పట్టం కట్టింది. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ఉమ్మడిజిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు బుధవారం సాయంత్రం హనుమకొండ జిల్లా మడికొండలోని యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, ఉమ్మడి వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ తడక రాజనారాయణ, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ ఎం.డి. షరీఫ్, ఏడీవీటీ మేనేజర్ మాటేటి రమేష్ విజేతలకు బహుమతులు అందజేశారు. లక్కీడ్రా నిర్వహణలో భాగంగా గతేడాది నవంబరు నుంచి నాలుగు నెలల పాటు కూపన్లను ప్రచురించి.. వాటిని పాఠకుల ద్వారా స్వీకరించి గతనెల 24న వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే చేతుల మీదుగా డ్రా తీశారు. అతిథులు ఉమ్మడి జిల్లా స్థాయిలో మొదటి, రెండో, మూడో విజేతలతో పాటు వంద మంది కన్సొలేషన్ విజేతలను ఎంపికచేశారు.



ప్రథమ విజేత అడవాల సదానందంనకు మోటార్‌బైక్ చెక్కును అందిస్తున్న 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, బ్యూరో ఇన్‌చార్జ్ రాజనారాయణ, ఏసీఎం షరీఫ్, ఏడీవీటీ మేనేజర్ రమేష్

ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ప్రథమ విజేతగా నిలిచిన వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అడవాల సదానందం మోటార్ బైకుకు సంబంధించిన చెక్కు, అలాగే ద్వితీయ విజేత నర్సంపేటకు చెందిన వామిక తరఫున ఆమె తాత తక్కళ్లపెల్లి సోమేశ్వర్‌రావు 185 లీటర్ల రిఫ్రిజిరేటర్, మూడో విజేతగా నిలిచిన మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన దేశగాని అధర్వ కృష్ణ తరఫున అతడి తాత వెంకటయ్య 32ఇంచెస్ టీవీ అందుకున్నారు. ఈ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి' పాఠకులుగా ఉన్న తాము ప్రతీ ఏడాది నిర్వహించే లక్కీ డ్రాలో బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ దినచర్య ఆంధ్రజ్యోతి చదవడంతోనే మొదలవుతుందని, పాఠకుల కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.



రిఫ్రిజిరేటర్ అందుకుంటున్న ద్వితీయ విజేత సోమేశ్వర్‌రావు



మూడో బహుమతిగా టీవీ అందుకుంటున్న వెంకటయ్య



పిల్లలకు సామాజిక బాధ్యతలు నేర్పాలి

▸ పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


విద్యార్థినిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు తల్లిదండ్రులు సామాజిక బాధ్యతలు నేర్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి సీతక్క అన్నారు. 'హాయ్' అనే సంస్కృతి మనది కాదని, నమస్కారంచేయడం నేర్పాలని అభిప్రాయపడ్డారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులను మంత్రి సన్మానించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపడం హర్షణీయమని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లాతో పాటు ఇన్‌చార్జి మంత్రిగా తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులు కూడా రెండో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మానవ విలువలు, సంస్కారంలో ముందుండాలని సూచించారు. విద్య ఎంత నేర్చుకున్నామనేది ముఖ్యం కాదని, అది మనకు ఎంత ఉపయోగ పడుతుందనేదే ప్రధానమనిఅన్నారు. మనం సంపాదించుకున్న జ్ఞానం నలుగురికి ఉపయోగ పడాలన్నారు. విద్యావంతులు మారుమూల గ్రామాల్లో ప్రజలకు చదువు చెప్పేందుకు ముందుకు రావాలన్నారు. ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంలో కలెక్టర్, విద్యాశాఖ అధికారుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీగా 'ములుగు'

అధికారిక ప్రకటన జారీ

ములుగు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ములుగు మునిసిపాలిటీగా మారింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ లా డిపార్ట్‌మెంట్ జస్టిస్ రెండ్ల తిరుపతి బుధవారం రాత్రి ఈమేరకు ప్రకటనను వెలువరించారు. ములుగును మునిసిపాలిటీగా చేయాలంటూ 2022లో అప్పటి ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టింది. కొన్ని అనివార్య కారణాల వల్ల అది కార్యరూపం దాల్చుకోలేదు. 1961లో గ్రామ పంచాయతీగా అవతరించిన ములుగు 2019లో జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. మళ్లీ ఇప్పుడు మునిసిపాలిటీగా మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లా కేంద్రంతోపాటు సమీపంలోని బండారుపల్లి, జీవంతరావుపల్లి గ్రామాలను కలుపుకొని మునిసిపాలిటీగా ఏర్పాటుచేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ములుగు మునిసిపాలిటీ పరిధిలో 16,533 మంది జనాభా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ములుగును 20 మునిసిపల్ వార్డులుగా విభజించనున్నట్లు పేర్కొన్నారు.

భూ భారతితోనే భూ సమస్యల పరిష్కారం

▸ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

నర్సింహులపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్‌తో భూ సమస్యల పరిష్కారం సాధ్యమని, రైతులు భూ భారతిని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో తహసీల్దార్ సీహెచ్.నాగరాజు అధ్యక్షతన భూ భారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పోర్టల్‌తో రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు తహసీల్దార్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్కడ పరిష్కారం లభించకపోతే ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌లను సంప్రదించాలన్నారు. భూ భారతి చట్టంలో రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుబ్రమణ్యాచారి, ఆర్డీవో జగన్, గిర్దావరి అఖిల్, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి Classifieds

Real Estate · Wanted · Health · Beautician · Jobs · For Sale

WANTED

★ Wanted P.R.O's Junior & Lectures all Subjects Reputed Junior College Hanamkonda Cell.No: 8341630919

AJW-237168

FOR SALE

★ హన్మకొండలో, మంచి రన్నింగ్‌లో ఉన్న హోటల్, స్టూడెంట్స్ మెస్ మరియు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ అమ్మబడును. సం॥ప్ర॥ 9703455400

AJW-237142

WANTED

★ Pre-Primary, Primary, High School, All Subjects Warden's P.E.T (Un-Married) M/F Interested Candidates may attend with Original Certificates. New Vision High Scool, Near : Gimibavi, Vill: Laknepally, Narsampet. Cell.No: 9849464761, 9550633624

AJW-237065

CHANGE OF NAME

★ I, **SHAIK SALEEM, S/o. ABDULLA (Old Name)** R/o. H.No: 3-16-97, Peddammagadda, Hanamakonda (Mdl&Dist). T.S. Have Changed my Name as **PALLE CHITTI BABU (New Name)** for all Purpose

AJW-237169

WANTED

★ Wanted Female English Teacher Who has good Fluency in English Communication & Has Experience in Teaching Social, Mathematics & Hindi For Classes 1st to 7th in Pradeep High School (E.M).HNK. Cell.No: 9515261096

AJW-237161

KALESHWARI INSTITUTE

★ Tuitions for Inter (Reg/Supply) for all Groups Advance Inter Course also Available. Tuitions for B.Tech, Diploma & Degree. Home Tuitions also available.Ph ; 8125080314, 9032857572

AJW-237143

అర్జెంటుగా కావలెను

★ వరంగల్ యం.జి.యం. దగ్గరలో హోటల్‌లో చేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. Timings: 6am to 7 pm. Food + అకామిడేషన్ ఫ్రీ. యం.జి. రోడ్, వరంగల్. సం॥ప్ర॥ 9573637686

AJW-6604

టూర్స్ & ట్రావెల్స్

★ 7 జ్యోతిర్లింగాలు, సరస్వతిపుష్కరాలు, పూరీజగన్నాథ్, గయా, కాశీ, అయోధ్య, ప్రయాగ, ఉజ్జయిని, షిర్డీ, భీమశంకర్ మే ఫస్ట్ వీక్‌లో బస్సు బయలుదేరును, స్లీపర్ కోచ్ మరియు సిట్టింగ్, పూర్తివివరాలకు సం॥ప్ర॥ 9949758499

AJW-237063

సెక్యూరిటి గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000-15,000. సం॥ప్ర॥ 9000463426

AJW-217393

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676

వరంగల్
9985406150
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9985418040

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

పండ్ల మార్కెట్ ఏర్పాటు హుళక్కేనా?!


దంతాలపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంగనపల్లి రకం మామిడి

▸ వ్యాపార సముదాయం లేక మామిడి రైతుల నిలువు దోపిడీ

▸ లైసెన్స్ వ్యాపారుల ఇష్టారాజ్యం?

▸ రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి

▸ జిల్లాలో 7,512 హెక్టార్లలో మామిడి సాగు


ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు ప్యాకింగ్ చేసి సిద్ధంగా ఉన్న మామిడి

నర్సింహులపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలో నాణ్యత పరిమాణం ఉన్నప్పటికీ అందుబాటులో పండ్ల మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు కాయలను తీసుకువెళ్లలేని రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో పండ్ల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్న పాలకుల మాటలు హామీలకే పరిమితం కావడంతో మామిడి రైతులు ప్రతీ ఏడాది గిట్టుబాటు ధర లేక అధికంగా నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 9,816 హెక్టార్లల్లో వివిధ రకాల పండ్ల తోటలు ఉండగా, వీటిల్లో 7,512 హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఆయా తోటల్లో బంగనపల్లి, సువర్ణలేఖ, చెరుకురసాలు, సుందరి, తోతాపురి లాంటి రకాల మామిడిని అత్యధికంగా పండిస్తున్నారు. ఆయా రకాల మామిడికి జాతీయ స్థాయిలో డిమాండ్ అధికంగా ఉండడంతో, ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి సరుకు నాణ్యతను బట్టి రేటు కేటాయించి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి మార్కెట్ రుసుం చెల్లిస్తూ టన్నుల్లో ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా ఎగుమతులు చేస్తున్నారు. దంతాలపల్లి కేంద్రం వివిధ జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉండడంతో నర్సింహులపేట, మరిపెడ, కురవి, డోర్నకల్, నెల్లికుదురు, మహబూబాబాద్, గూడూరు, తొర్రూరు, కేసముద్రం, కొడకండ్ల, దేవరుప్పల, పర్వతగిరి, రాయపర్తి మండలాలతో పాటు ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి మామిడి రైతులు సరుకు ఇక్కడకు తీసుకొచ్చి విక్రయిస్తారు.

మామిడికి పెరుగుతున్న డిమాండ్

అంతర్జాతీయ మార్కెట్‌లో మామిడికి డిమాండ్ రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ స్థానిక మామిడి రైతులు మాత్రం మార్కెట్ వసతి లేకపోవడంతో ప్రతీ ఏడాది లైసెన్స్ వ్యాపారుల చేతిలో నిలువు దోపిడీకి గురవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా మామిడి మార్కెట్‌లో ధర టన్నుకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఉంటుంది. కానీ, లైసెన్స్ వ్యాపారుల మాయాజాలంతో ప్రస్తుతం టన్ను మామిడి ధర రూ.20 వేల నుంచి రూ.25 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని కొందరు మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఎగుమతులు

ఇక్కడి మామిడి నాణ్యత ప్రమాణంతో ఉండడం వల్ల జాతీయ స్థాయిలో ఎగుమతి అవుతున్నది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల నుంచి అక్కడి వ్యాపారులు ఇక్కడి లైసెన్స్ వ్యాపారుల కన్సల్టింగ్‌తో దంతాలపల్లికి వచ్చి మామిడిలో నాణ్యత ప్రకారం టన్నుల్లో విక్రయించి ప్లాస్టిక్ ట్రేల్లో ప్యాకింగ్ చేసి లారీల్లో ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు.

మార్కెట్ సౌకర్యంతో లాభాలు..

తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పండ్ల మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మామిడి, నిమ్మ, సపోటతో పలు రకాల పండ్ల రైతులకు లాభం చేకూరుతుంది. ఇక్కడి రైతులు సుదూర ప్రాంతాలకు మామిడి, నిమ్మ, బత్తాయి, సపోటాను ఎగుమతి చేయాలంటే రవాణా ఖర్చులు అధికంగా అవుతుండడంతో తప్పని పరిస్థితుల్లో సరుకును విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ వసతి కల్పిస్తే నేరుగా రైతులకు లాభం చేకూరనున్నది.


మామిడి కాయలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

మార్కెట్ ఆదాయానికి గండి

దంతాలపల్లి సెంటర్‌లో విక్రయాలు జరిగే మామిడితో తొర్రూరు మార్కెట్‌కు ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నది. డివిజన్ వ్యాప్తంగా ఒక్కరిద్దరే లైసెన్స్ వ్యాపారులు ఉండడం, పోటీతత్వం లేకపోవడం వారు సిండికేటుగా మారి మార్కెట్‌కు సమకూరాల్సిన ఆదాయాన్ని లక్షల్లో గండికొడుతున్నట్లు మామిడి రైతులు కొందరు ఆరోపిస్తున్నారు. చెక్‌పోస్టులో పనిచేసే సిబ్బంతోనే మార్కెట్ రుసుమును వసూల్ చేయిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఎగుమతి సరుకుపై ఒక శాతం ప్రకారం 2016-17లో రూ.2.50 లక్షలు, 2017-18లో రూ.3.30 లక్షలు, 2022-23లో రూ.3.10 లక్షలు, 2023-24లో రూ.3.40 లక్షలు చొప్పున రుసుము రూపంలో ఆదాయం సమకూరినట్లు మార్కెట్ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంకా ఆదాయం పెరగాల్సి ఉన్నట్లు సమాచారం.

పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలి

పుప్పాల రవీందర్, మామిడి రైతు, కొమ్ములవంచ



తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పండ్ల మార్కెట్ సౌకర్యం తప్పనిసరి. మార్కెట్ సౌలభ్యం లేకపోవడంతో మామిడి, నిమ్మ, జామ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. లైసెన్స్ వ్యాపారులతో మద్దతు ధర లభించక మామిడి రైతులు లక్షల్లో నష్టపోతున్న మాట వాస్తవమే. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పండ్ల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేయాలి.

కూంబింగ్ బలగాలకు చిక్కిన వేటగాళ్లు?

వాజేడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కర్రెగుట్టలను ప్రారంభించిన కూంబింగ్ బలగాలకు ముగ్గురు వేటగాళ్లు చిక్కినట్లు సమాచారం. మండలంలోని ములకనపల్లికి చెందిన ఆరుగురు మంగళవారం అడవిలోకి శికారుకు వెళ్లినట్లు తెలిసింది. ఆ ఆరుగురిలో ముగ్గురు బుధవారం ఉదయం కూంబింగ్ బలగాలకు చిక్కినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అడవిలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన ప్రజల్లో నెలకొంది. పట్టుబడిన ఆ ముగ్గురిని ఏం చేస్తారోననే కంగారు పడుతున్నారు. అయితే.. బలగాలకు చిక్కిన ముగ్గురిని కూంబింగ్ బలగాలు పేరూరు స్టేషన్‌లో అప్పగించినట్లు సమాచారం.

అకాల వర్షంతో రైతులు ఆగమాగం

● వాజేడు, ఏటూరునాగారం మండలాల్లో తీవ్ర నష్టం

వాజేడు/ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వాజేడు, ఏటూరునాగారం మండలాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం భారీగా కురిసింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాజేడు మండలంలోని చింతూరు పంచాయతీలోని అర్లగూడెంలో కల్లాలో ఆరబెట్టిన మిర్చి పూర్తిగా దెబ్బతింది. సుమారు 20 ఎకరాల్లో మిర్చి పంట నాశనం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆకస్మికంగా కురిసిన వర్షంతో రైతులకు టార్పాలీన్లు కప్పే ఆస్కారం కూడా లేకుండాపోయింది. మిరపకాయలు మొత్తం విడిపోయి ఉండటంతో మార్కెట్ ఎవరూ కొనరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు గడ్డం రమేష్, అట్టం శ్రీకాంత్, అట్టం ఆశోక్, గుండెబోయిన నాగరాజు, ఆనందరావు, కోటేశ్వరరావుకు చెందిన మిర్చి నాశనమైంది.


వాజేడులో తడిసిన మిర్చిని చూపుతున్న రైతులు

ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లిలో వర్షం బీభత్సం సృష్టించింది. కోతకు వచ్చిన వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. వరి కంకులన్నీ వడగండ రాలి నేలమట్టమయ్యాయి. చేతికందిన పంట నేలపాలు కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. దాదాపు 350 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రైతులు ములుగు కలెక్టర్ దివాకరను కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష

▸ ప్రత్యేక ప్రణాళికతో డోర్నకల్ అభివృద్ధికి కృషి

▸ ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్

నర్సింహులపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలే రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ అన్నారు. బుధవారం నర్సింహులపేటలోని రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 24 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున రూ.24.02 లక్షలు చెక్కుల రూపంలో పంపిణీ చేశామన్నారు. డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో సుమారుగా 130 మంది లబ్ధిదారులకు రూ.1.37కోట్లు చెక్కుల రూపంలో అందజేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారంటీల అమలుతో దేశంలో ఆదర్శంగా పేరు ప్రఖ్యాతలు వస్తున్నాయన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో రూ.56 కోట్లు వడ్డీ రూపంలో డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేసినట్లు తెలిపారు. రూ.250 కోట్లతో అంతర్గత వీధుల్లో సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.నాగరాజు, ఎంపీడీవో యాకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, ఎస్టీసెల్ అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, గ్రామీణ వైద్యుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు గుగులోతు రాజేందర్, మండల యువజన నాయకుడు తోట సురేష్, చిర్ర సతీష్, చల్లా మధురెడ్డి, అధికారులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

పరిధి దాటితే చర్యలు తప్పవు..

కాంగ్రెస్ పార్టీ ద్వితీయ, తృతీయ స్థాయి శ్రేణులు అధిష్ఠానం ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని, పరిధి దాటితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమీక్షలో హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. కొందరు కార్యకర్తలు పద్ధతి మార్చుకోకపోతే క్రమ శిక్షణ రహిత చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు.


నర్సింహులపేటలో కల్యాణలక్ష్మి చెక్కులను తీసుకున్న లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్

ఆత్మీయ సన్మానాన్ని విజయవంతం చేయాలి

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వీఆర్ఎన్ గార్డెన్‌లో ఈ నెల 29న నిర్వహించ తలపెట్టిన రాజ్యాంగపరిరక్షణ సదస్సులో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం నర్సింహులపేటలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను కలిసి ఆహ్వానం పలికారు. జాతీయ నాయకుడు ఆశోద భాస్కర్, జిల్లా అధ్యక్షుడు మహేష్, గుండాల భిక్షం పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి


రవళి (ఫైల్)

దుగ్గొండి ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వడ దెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బంధువుల కథనం ప్రకారం.. తిమ్మంపేట గ్రామానికి చెందిన నాంపెల్లి రవళి(35), రాజేందర్ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతారు. వారికి ఇద్దరు కుమార్తెలు జ్యోతిప్రియ(14), లక్ష్మీప్రసన్న (12)లు ఉన్నారు. నాంపెల్లి రవళి వారం కిందట మండలంలోని ముద్దునూరులో బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండగా వెళ్లింది. నాలుగురోజుల కిందట తల్లిగారి గ్రామమైన మండలంలోని మహ్మదాపురం చేరుకొని ఉంటోంది. బుధవారం ఇంటి పరిసరాలలో పనిచేస్తున్న క్రమంలో రవళి ఇక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే బంధువులు ప్రైవేట్ వాహనంలో నర్సంపేటలోని ఆస్పత్రికి తీసుకొనిపోతుండగా మార్గమధ్యలోనే మరణించింది. మృతురాలికి మాజీ సర్పంచ్‌లు మోడెం విద్యాసాగర్, నరహరి రమాదేవి భాస్కర్‌రెడ్డి, మాజీఎంపీటీసీ మోడెం మల్లేశం, గ్రామస్థులు నివాళులర్పించారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో భోజన కార్మికురాలు..


రమ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: వడదెబ్బతో మధ్యాహ్న భోజన కార్మికురాలు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని మాడల్ కాలనీకి చెందిన పులి రమ(50) రెండు రోజుల కిందట వ్యక్తిగత పనుల కోసం ఎండలో బయటకు వెళ్లి వచ్చింది. ఇంటికి వచ్చిన ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో పాటు వాంతులు కావడంతో వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమ భర్త కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె హిమజ భర్త సైతం గతంలో మృతి చెందడంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో తల్లి రమ వద్దనే ఉంటోంది. కలెక్టర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గణపురంలో పశువుల కాపరి..


సాంబయ్య (ఫైల్)

గణపురం: వడదెబ్బతో పశువుల కాపరి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా గణపురం మండల కేంద్రం శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నారాయణగిరిపల్లి చెందిన తాళ్ల సాంబయ్య(65) అదే గ్రామానికి చెందిన యాట సాంబయ్య వద్ద పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. నారాయణగిరిపల్లి శివారులోని గణపురం మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం పశువులు కాస్తుండగా అపస్మారక స్థితిలోకివెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. పశువులు కాస్తుండగానే అపస్మారస్థితికి చేరుకున్న సాంబయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సాంబయ్యకు ఇద్దరు కుమారులు కాగా భార్య గతంలోనే మృతి చెందింది.

టీపీసీసీ పరిశీలకులుగా మనోళ్లు..

● ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల్లో పలువురి నియామకం

● గాంధీ భవన్‌లో ప్రకటించిన మీనాక్షి నటరాజన్

● మొత్తంగా 11 మందికి పదవులు.. కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కమిటీ పరిశీలకులుగా పలువురు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. టీపీసీసీ అబ్జర్వర్లుగా నియమితులైన నేతలను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ నియామకాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలకు ఇతర జిల్లాల పరిశీలకులుగా బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల్లో టీపీసీసీ అబ్జర్వర్లుగా నియమితులైన వారిలో నాయిని రాజేందర్‌రెడ్డి, డాక్టర్ మురళీనాయక్‌లు ఉన్నారు. అలాగే కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కూచన రవళిని జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల పరిశీలకులుగా నియమితులయ్యారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 11 మంది టీపీసీసీ పరిశీలకులుగా బాధ్యతలు పొందారు. వీరిలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి, కూచన రవళి మహిళలుగా ఉన్నారు. టీపీసీసీ పరిశీలకులుగా నియమితులైన వారి వివరాలు ఇలా ఉన్నాయి..

ఖమ్మం జిల్లాకు: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు బత్తిని శ్రీనివాస్.

కుమరం భీమ్ అసిఫాబాద్ జిల్లాకు: ఎం.డి. రియాజ్ (రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్)

మంచిర్యాల జిల్లా: స్టేట్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

జగిత్యాల : కత్తి వెంకటస్వామి

కరీంనగర్ : నమిండ్ల శ్రీనివాస్

మహబూబ్‌నగర్ జిల్లా: దొమ్మాటి సాంబయ్య

నాగర్ కర్నూల్: బెల్లయ్య నాయక్

సూర్యాపేట: మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

యాదాద్రి భువనగిరి: లకావత్ ధన్వంతి, డాక్టర్ పులి అనిల్‌కుమార్

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు ఇతర జిల్లా టీపీసీసీ పరిశీలకులుగా నియమితులైన క్రమంలో ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిశీలకులుగా నియమితులైన వారి వివరాలు.

జనగామ జిల్లా: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

మహబూబాబాద్: పోట్ల నాగేశ్వరరావు, కూచన రవళి (రవళి హనుమకొండ)

హనుమకొండ జిల్లా: కోటిమ్‌రెడ్డి వినయ్ రెడ్డి, మక్సూద్ అహ్మద్

వరంగల్ జిల్లా: అమీర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర

జయశంకర్ భూపాలపల్లి: ఇనుగాల వెంకట్రాంరెడ్డి

ములుగు: కొండేటి మల్లయ్య

పార్టీకి పని చేసిన వారిని గుర్తిస్తున్నారనే భావన

తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు పొందిన తరువాత పార్టీ కోసం పని చేసే శ్రేణులు గుర్తింపు ఆరంభమైందనే విశ్వాసం నెలకొంది. టీపీసీసీ అబ్జర్వర్ల నియామకం కూడా ఈ కోణంలోనే పరిగణించవచ్చనే అభిప్రాయాలు నెలకొన్నాయి. సీనియర్లతో పాటు కొందరు యువ నాయకులను కూడా అబ్జర్వర్లుగా నియమించడమే ఇందుకు కారణంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీపీసీసీ పరిశీలకులుగా నియమితులైన వారు గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో కింది స్థాయి నుంచి కష్టించి పనిచేస్తున్న శ్రేణులను అబ్జర్వర్లు గుర్తించి అధిష్ఠానానికి నివేదించే అవకాశాలు ఉంటాయంటున్నారు. ఈ క్రమంలో గ్రామస్థాయి నుంచి నాయకత్వ గుర్తింపు తద్వారా పార్టీ న్యాయం చేసే పరిస్థితులు నెలకొంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. త్వరలో మరిన్ని పదవులు అధిష్ఠానం నేతలకు కట్టబెడుతుందనే విశ్వాసంతో పార్టీ శ్రేణులు ఉన్నాయి.

ఇదిలా ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొందరు సీనియర్లలో టీపీసీసీ పరిశీలకుల నియామకాల్లో తమను గుర్తించలేదనే ఆవేదన నెలకొంది.


ఎల్కతుర్తి సభా ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో పార్టీ నాయకులు

ఇది సర్కారుపై పోరు కాదు.. పార్టీ పండుగ

- బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగను జరుపుకుంటున్నాం..
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఎల్కతుర్తిలో నాయకులతో కలిసి సభ ఏర్పాట్ల పరిశీలన

ఎల్కతుర్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికో.. ప్రజలను రెచ్చగొట్టడానికో.. ఏర్పాటు చేసుకునే సభ కాదని, శాంతియుతంగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవానికి జరుపుకోవడానికి నిర్వహించుకుంటున్న మహాసభ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సభ మ్యాపును నాయకులు చూపించగా కేటీఆర్ పరిశీలించి పార్టీ ప్రముఖులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముందుగా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన మృతులకు సంతాపకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 24 ఏళ్ల కిందట ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. 14 ఏళ్లపాటు తెలంగాణ ప్రజలను సమీకరిస్తూ, తెలంగాణ ఆవశ్యకతను, రాజకీయ వ్యవస్థను ఉద్యమ కాలంలో వివరిస్తూ అంబేద్కర్ చెప్పిన విధంగా 'బోధించు, సమీకరించు, పోరాడు..' అనే నినాదతత్వాన్ని ఒంటపట్టించుకుని ప్రజాస్వామిక పద్ధతిలో తెలంగాణను 2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీని స్థాపించుకున్నామన్నారు. స్వాతంత్రం వచ్చాక తెలుగురాష్ట్రాల్లో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చి అదే తరహాలో మాయమైనట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రెండున్నర దశాబ్దలుగా నిలదొక్కుకున్న పార్టీలు రెండేనన్నారు. ఒకటి ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ, మరొకటి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ అన్నారు. 10 ఏళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన బాధ్యతను అద్భుతంగా నిర్వహించి ప్రజల గొంతుకగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నామన్నారు. అధికారం లేకపోయినా ప్రజలకు గుండె ధైర్యంగా గులాబీ పార్టీ అండగా ఉందన్నారు. ఏ కష్టం వచ్చినా హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వైపే ప్రజలు వెళ్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు జనతా గ్యారేజీ మాదిరిగా అండగా ఉందన్నారు. హైడ్రా, మూసీ, లగచర్ల, సెంట్రల్ యూనివర్సిటీ బాధితులు గులాబీ జెండాతోనే న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా నాటి ఉద్యమం నుంచి గులాబీ పార్టీకి అండగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. తిరిగి అదే జిల్లా పరిధిలో రజతోత్సవ ఉత్సవాలు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. సభ నిర్వహణకు 1,250 ఎకరాల స్థలాన్ని సేకరించామని, 200 ఎకరాల్లో సభాస్థలం పోను 1,050 ఎకరాల్లో 40 వేల వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. సిద్ధిపేట, కరీంనగర్, వరంగల్, ధర్మసాగర్ రోడ్డులో సభాస్థలికి సమీపంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబ్‌నగర్ జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు వేర్వేరుగా సభాస్థలికి దగ్గరలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అందుబాటులో 10 లక్షల వాటర్, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్‌లను ఉంచినట్లు తెలిపారు. అలాగే 100 వైద్య బృందాలతో ప్రత్యేక వైద్య శిబిరాలు, 20 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చే మహిళలకు, పురుషులకు వేర్వేరుగా తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటితో పాటుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేక ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని విద్యుత్‌ను నమ్ముకోకుండా 200 ప్రత్యేక జనరేటర్లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,796 గ్రామ పంచాయతీల నుంచి గులాబీ సైనికులు రజతోత్సవ పండుగకు బయలుదేరి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 27న జరిగే మహా బహిరంగ సభకు కేసీఆర్ సాయంత్రం 4.30గంటల వరకు చేరుకోనున్నట్లు తెలిపారు. కేసీఆర్ ప్రసంగం ప్రజలకు మరో నూతన ఉత్సాహాన్ని ఇవ్వనున్నట్లు సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెండు వేల మంది వలంటీర్లు శ్రమించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే అధికారులు, నాయకులు సహకరించాలని కోరారు. సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎవరికి అందుబాటులో ఉన్న వాహనంలో వారు తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు తక్కళ్లపెల్లి రవిందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, రాజయ్య, ధర్మారెడ్డి, రాష్ట్ర నాయకులు బాలమల్లు, గెల్లు శ్రీనివాస్, డాక్టర్ సుధీర్‌కుమార్, చింతం సదానందం, నాయకులు పిట్టల మహేందర్, నగేష్, మహేందర్, స్వామి రవిందర్‌రెడ్డి, మధన్‌మోహన్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబైన సభా వేదిక

సమన్వయంతో పని చేయండి..

సభ సక్సెస్‌పై దృష్టి పెట్టండి » నియోజకవర్గ బాధ్యులతో కేటీఆర్ సమీక్ష

వరంగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈనెల 27న ఎల్కతుర్తిలో జరుగనున్న రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నాయకత్వం సమన్వయంతో కలిసి పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ.రామారావు కోరారు. బుధవారం హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గృహంలో నియోజకవర్గ బాధ్యులతో సభ సక్సెస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నాయకుల మధ్య విభేదాలు ఉంటే పక్కన పెట్టి, సభకు జనసమీకరణపై దృష్టి పెట్టాలన్నారు. ఏ నియోజకవర్గం నుంచి ఎంత మంది వస్తున్నారో పక్కాగా లెక్కలు ఉండాలన్నారు. ప్రతీ గ్రామంలో, మునిసిపాలిటీ వార్డుల్లో గులాబీ జెండాను ఎగరవేసిన తరువాతే సభకు తరలి రావాలని కోరారు. నియోజకవర్గ బాధ్యులు మండలతో పాటు మేజర్ గ్రామాల్లో కూడా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వినయ్‌భాస్కర్, వొడితల సతీష్‌కుమార్‌లు సభ ఏర్పాట్లు బాగా చేశారని, అలాగే మాజీ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు సన్నాహక సమావేశాలతో ప్రజల్లో రజతోత్సవ సభను తీసుకెళ్లారని అన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి, జనసమీకరణను పర్యవేక్షించాలని సూచించారు. రజతోత్సవ వేడుకలు నిర్వహించే అవకాశాన్ని కేసీఆర్ వరంగల్ నాయకత్వానికి అప్పగించారని అన్నారు. ఇలాగే సభ పూర్తయ్యే వరకు సమన్వయంతో పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపనేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, బడే నాగ జ్యోతి, వాసుదేవరెడ్డి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


నియోజకవర్గాల బాధ్యులతో సమీక్షిస్తున్న కేటీఆర్

పాతికేళ్ల గులాబీ..

(5వ పేజీ తరువాయి)

వేశారు. ఆ తరువాత కేసీఆర్ వారిపై చర్యలు తీసుకోవటంతో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన దుగ్యాల శ్రీనివాస్‌రావు, కంభంపాటి లక్ష్మారెడ్డి, మందాడి సత్యనారాయణరెడ్డి తదితరులు కాంగ్రెస్‌కు అనుబంధంగా చేరారు. దీంతో టీఆర్ఎస్ ఇక నిలదొక్కు కోవటం కష్టమే అనే చర్చ జరి గింది. ఇలాంటి ఎన్నో అటుపోట్లను ఎదుర్కొని, స్వరాష్ట్రంలో 2014లో అధికారాన్నే చేపట్టింది. ఇక అనేక మందికి రాజకీయ జీవితాన్ని ఇవ్వగా, మరికొందరికి రాజకీయంగా అండగా నిలిచింది. వరంగల్ ఎంపీగా రెండు పర్యాయాలు గెలిచిన పసునూటి దయాకర్‌కు రాజకీయ జీవితాన్ని ఇచ్చింది టీఆర్ఎస్సే. సామాన్య కార్యకర్తగా చేరిన దయాకర్ అనూహ్యంగా రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. ఆయనతో పాటు న్యాయవాదిగా పని చేస్తున్న క్రమంలోనే బోయినపల్లి వినోద్‌కుమార్ రెండు సార్లు హనుమకొండ ఎంపీగా విజయం సాధించారు. వరంగల్ ఎంపీగా 2004లో రవీంద్రనాయక్ తొలిసారి గెలిచారు. టీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎనిమిదేళ్లు పని చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసి విజయవంతంగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. దాస్యం వినయ్‌భాస్కర్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి రెండు పర్యాయాలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించి రాజకీయాల్లో పట్టుబిగించారు. అరూరి రమేష్, శంకర్‌నాయక్, మాలోతు కవిత, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు గులాబీ జెండాతోనే రాజకీయాల్లో వెలుగుతున్నారు. కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, చల్లా ధర్మారెడ్డిలాంటి తదితరులు టీఆర్ఎస్‌లో కీలకంగా ఎదిగారు. మొలుగూరి భిక్షపతి, నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, బడే నాగజ్యోతి, సుందర్‌రాజ్ యాదవ్, వాసుదేవరెడ్డి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, జోరిక రమేష్ ఇలా అనేక మంది ఉద్యమాల నుంచి వచ్చి రాజకీయాల్లో గుర్తింపు పొందారు. ఇలా ఎందరికో రాజకీయంగా గులాబీ జెండా నీడను ఇచ్చింది.

శ్రేణుల్లో జోష్ నింపేలా ఆవిర్భావ సభ

వరుస ఓటములతో డీలా పడిన గులాబీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభ దోహదపడుతుందని బీఆర్ఎస్ నేతలు అంచనా వేస్తున్నారు. 2023లో టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పార్టీ పేరు మార్చుకుని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికి ఓరుగల్లు ఓటర్లు గులాబీకి ఝలక్ ఇచ్చారు. 12 అసెంబ్లీ స్థానాల్లో 10చోట్ల కాంగ్రెస్‌కు ఓటర్లు పట్టం కట్టి గులాబీకి షాక్ ఇచ్చారు. కేవలం స్టేషన్‌ఘనపూర్, జనగామ స్థానాల్లోనే బీఆర్ఎస్ గెలిచింది. స్టేషన్‌ఘనపూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి ఆరు నెలల్లోనే కారు దిగి హస్తం గూటికి చేరిపోయారు. ఈ ఓటమి నుంచి తేరుకోకముందే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ ఓడిపోయింది. ఆ తరువాత జరిగిన వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పార్టీ శ్రేణులను మరింత నిరాశ పరిచింది. ఇటీవల జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయక పోవటం.. ఎవరికి మద్దతు ఇవ్వకపోవటం క్యాడర్‌కు కొంత అసంతృప్తికి గురి చేసింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచిన బీఆర్ఎస్.. మళ్లీ క్యాడర్‌లో నూతనోత్సహం నింపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికీ గ్రామస్థాయిలో పార్టీ చెక్కు చెదరకుండా ఉందనే ధీమా నేతల్లో వ్యక్తమవుతోంది. క్యాడర్‌లో జోష్ నింపేలా వరంగల్ వేదికగా ఈ నెల 27న పార్టీ రజతోత్సవాలను ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమైంది. ఉద్యమాల ఖిల్లాగా ఉన్న వరంగల్ నుంచే పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేలా అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తుంది.

'హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్'కు జేఎన్ఎస్ ముస్తాబు

- 4 రోజుల పాటు పండుగ వాతావరణంలో సాగనున్న క్రీడలు
- ఉమ్మడి పది జిల్లాల నుంచి 300 మంది బాలబాలికలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్‌హంట్ క్రీడాపోటీలు నిర్వహించేందుకు హనుమకొండ జేఎన్ఎస్ హ్యాండ్‌బాల్ కోర్టు ముస్తాబైంది. గురువారం నుంచి ఈనెల 27వరకు అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న టాలెంట్‌హంట్ టోర్నీలో ఉమ్మడి పది జిల్లాల నుంచి 200 మంది బాలురు, 100 మంది బాలికలతో పాటు 50మంది రెఫరీలు, కోచ్‌లు పాల్గొననున్నట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, క్రీడా పోటీల నిర్వాహకుడు శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. 4రోజుల పాటు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే ఈ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు హనుమకొండ బాలసముద్రంలోని ఇండోర్ స్టేడియంతో పాటు, సమీపంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు, పలు పాఠశాలల్లో వసతి కల్పించామన్నారు. అదే విధంగా రెఫరీస్, కోచ్‌లకు జేఎన్ఎస్ సమీపంలోని యూత్ హాస్టల్‌లో బస కల్పించామని పవన్ తెలిపారు. ఈ క్రీడా పోటీలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్, వేముల శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై ప్రారంభించనున్నట్లు పవన్ తెలిపారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలను తీసుకున్నామన్నారు.

ఇండోర్, పలు పాఠశాలల్లో వసతి

రాష్ట్రస్థాయి టాలెంట్‌హంట్ టోర్నీలో పాల్గొననున్న క్రీడాకారులకు భోజన సౌకర్యంతో పాటు జేఎన్ఎస్‌కు సమీపంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు, వివిధ పాఠశాలలు, ఇండోర్ స్టేడియంలో బస వసతి కల్పించడానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫ్లడ్ లైట్ల వెలుతురులో క్రీడలు

ఎండ వేడిమి దృష్ట్యా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం సూర్యరశ్మి రాకముందు, అలాగే రాత్రి వెలుతురు కోసం క్రీడాపోటీలు అట్టహాసంగా నిర్వహించడానికి హ్యాండ్‌బాల్ కోర్టులో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసినట్లు క్రీడా పోటీల నిర్వాహకులు తెలిపారు.

మండుతున్న ఎండలు

- 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యధికం

హనుమకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. బుధవారం గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో అత్యధికంగా పగటి ఉష్ణోగ్రత నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో రికార్డు స్థాయిలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ములుగు జిల్లాలో 43.4 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలోని దామెరలో 43.2 డిగ్రీలు, జనగామ జిల్లాలో 43.1 డిగ్రీలు, వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్‌లో 42.7 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలో 42.7 డిగ్రీలు నమోదైంది. పగటి ఉష్ణోగ్ర తలు అత్యధికంగా నమోదవుతున్నందువల్ల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

కర్రెగుట్టలో బాంబుల మోత

- కొనసాగుతున్న 'బచావో' ఆపరేషన్
- మందుపాతరలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర బలగాలు

వాజేడు/ వెంకటాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని కర్రెగుట్టలో కేంద్ర బలగాలు ముమ్మరంగా కూంబింగ్ చేపడుతున్నాయి. సుమారు 3వేల మందికి పైగా సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్ బలగాలతో పాటు తెలంగాణ పోలీసులు కర్రెగుట్టలను చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేతను ప్రారంభించిన విషయం విదితమే. ఈ క్రమంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో విస్తరించి ఉన్న కర్రెగుట్టలను మావోయిస్టులు సేఫ్ జోన్‌గా ఎంచుకొని మకాం వేసినట్లు సమాచారం. ఇటీవల కర్రెగుట్టల చుట్టూ బాంబులు అమర్చామని మావోయిస్టులు ప్రకటించారు. దీంతో కేంద్ర బలగాలు 'బచావో కర్రెగుట్ట ఆపరేషన్'ను ప్రారంభించాయి. ఇందులో ఛత్తీస్‌గఢ్ బలగాలు, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా పాల్గొన్నట్లు తెలుస్తోంది జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, ఆలుబాక ప్రాంతాలను కూంబింగ్ బలగాలు కర్రెగుట్టల వైపు చొచ్చుకొని వెళ్తున్నాయి. మూడు రోజులుగా వేలాది మంది పోలీసు బలగాలు అడవులను చుట్టి ముట్టాయి.

పోలీస్ బలగాల కూంబింగ్

మూడు రోజులుగా బచావో కర్రెగుట్టల పేరుతో కూంబింగ్ బలగాలు కర్రెగుట్టల వైపు దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలో బాంబు మోత వినిపిస్తోంది. వెంకటాపురం మండలంలోని రాచపల్లి, కలిపాక, మోట్లగుడెం ప్రాంతాలకు బాంబుల మోత వినపడటం గమనార్హం. పది నిమిషాలకు ఒకటి చొప్పున బాంబుల శబ్దం వినిపిస్తుండటంతో సరిహద్దు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మావోయిస్టులు కర్రెగుట్టలో బాంబులు అమర్చామని చెప్పగా వాటిని కూంబింగ్ బలగాలు నిర్వీర్యం చేసుకుంటూ కర్రెగుట్టల వైపు వెళ్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు కర్రెగుట్టల చుట్టూ వందలాది మందుపాతర అమర్చినట్లు తెలుస్తుండగా కూంబింగ్ బలగాలు తమ అత్యాధునిక ఆయుధాలు, బాంబ్ స్క్వాడ్‌తో వాటిని నిర్వీర్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

హెలికాప్టర్‌లో నిత్యావసర సామగ్రి

కర్రెగుట్టలో 72 గంటలుగా సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్న బలగాలకు బుధవారం వెంకటాపురం నుంచి హెలికాప్టర్లలో నిత్యావసర సామగ్రిని పంపిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర బలగాలకు చెందిన మూడు హెలికాప్టర్లు కర్రెగుట్టల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తూ మావోయిస్టుల జాడ కోసం వెతుకుతున్నట్లు సమాచారం. డ్రోన్ల సాయంతో అడవులను జల్లెడ పడుతున్నట్లు తెలుస్తోంది. డ్రోన్లు చూపే దారిలో కేంద్ర బలగాలు కర్రెగుట్టల ముందుకు కదులుతున్నట్లు తెలిసింది. కేంద్ర బలగాలు గత మూడు రోజులుగా అడవుల్లో ఉండటంతో వారికి వాటర్ బాటిల్స్, బిస్కట్స్, ఆహార పదార్థాలను హెలికాప్టర్ల ద్వారా చేరవేస్తున్నట్లు తెలుస్తోంది.


వెంకటాపురంలో ల్యాండ్ అవుతున్న ఆర్మీ హెలికాప్టర్

వెంకటాపురంలో బస్తర్ ఐజీ

బచావో కర్రెగుట్టల ఆపరేషన్‌ను ఛ త్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుమారు 3వేల మంది కూంబింగ్ బలగాలు మూడు రోజులుగా కర్రెగుట్టల వైపు వెలుతుండటంతో ఐజీ సుందర్ రాజన్ బుధవారం వెంకటాపురం నుంచి ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు ఇతర ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు సైతం ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. కూంబింగ్ బలగాలకు నిత్యం సూచనలు చేస్తూ వారికి కావాల్సిన సమాచారాన్ని అందిస్తున్నట్లు సమాచారం.

లక్ష్యం నిరంతరం కళ్లముందే..

- ఇంట్లో ప్రతీ చోట అక్షరాలే..
- గోడలు, కిటికీలు, తలుపులు.. అన్నింటిపై అక్షరాలే
- సివిల్స్ టాపర్ సాయిశివాని సాధన



వరంగల్ ఎడ్యుకేషన్ (వరంగల్ టౌన్) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్దేశించుకొని స్థిరంగా చదివితే ఎలాంటి ప్రత్యేక శిక్షణ అవసరం లేదంటున్న సివిల్స్ టాపర్ సాయిశివాని.. తన లక్ష్యాన్ని నిరంతరం కళ్ల ముందు కనబడేలా ఇంటి నిండా అక్షరాలనే నింపింది. ఆమె ఐఏఎస్ లక్ష్య సాధనలో ఎంతటి కఠోర శ్రమను ఆచరించిందనే విషయాన్ని ఆమె ఇంటి గోడపై ఉన్న ప్రతీ అక్షరం చెబుతోంది. దేశంలోని అత్యున్నతమైన ఉద్యోగాన్ని సాధించేందుకు రాసే పరీక్ష సివిల్స్‌పై ఉన్న ప్రేమ అమె ఇంటి గోడలు.. కిటికీలు.., కాదు.. కాదు... ఇంటి నిండా ఎక్కడ చూసినా అక్షరాలే చెబుతాయి. సాయిశివాని సివిల్స్‌కు ఎలా సాధన చేసిందో ఆమె ఆచరించాల్సిన వివరాలను, చదవాల్సిన సిలబస్‌ను, చదవాల్సిన పుస్తకాల వివరాలను ఇలా అనేక అంశాలను ఇంటి నిండా అక్షరాలతో నింపింది. ఇంటిని అక్షరాలతో నింపి దేశంలోనే అత్యున్నత పరీక్షలో జాతీయ స్థాయిలో 11వ ర్యాంకును సాధించి ఇంటిల్లిపాదిని ఆనందసాగరాల్లో ఒలలాడిస్తోంది.



ఇళ్లు కాదు.. అక్షర భాండాగారం..

వరంగల్ శివనగర్‌లోని మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఇట్టబోయిన సాయిశివాణి తన ల క్ష్యాన్ని ముందుగా మనస్సులో నింపు కుంది. అయితే లక్ష్య సాధన ఏ క్షణమైనా మరిచిపోతానేమో అనే భయంతో తన లక్ష్యాన్ని అక్షరాల రూపంలో ఇం టి నిండా నింపేసింది. తన కంటికి అక్షరాలే తప్ప మరొకటి కనిపించకుండా మూడేళ్లు గడిపిందంటే అతిశయోక్తి కాదు. ప్రసుత్తం కాస్త చదివితేనే ఖరీదైన ఫోన్లు, అనేక రకాల సోషల్ మీడియాలో ఖాతాలు తెరుచుకొని ఉల్లాసంగా గడుపుతున్న యువతకు భిన్నంగా సాయిశివాని వ్యవహరించిన తీరు అబ్బురపరుస్తోంది. చిన్నారులు గోడలపై ఏబీసీడీలు రాసినట్లు ఆమె చదువుతున్న ప్రతీ అక్షరాన్ని, లక్ష్యాన్ని గోడలు, కిటికీలు, దేవుని సొరుగు ఇలా అన్ని చోట్ల రాసుకుంది. ఇక ఆమె చదువుకునే గది అక్షర భాండాగారంలా నిండిపోయింది.

మూడేళ్లుగా అక్షరాలతో సహవాసం

ఇంటిగ్రేటెడ్ పూర్తైన నాటి నుంచి శివనగర్ లోని ఇంట్లోనే ఉంటూ అక్షరాలతో సహవాసం చేసిందంటే అతిశయోక్తి కాదు. తన కఠోర శ్రమ ఆమె గదిలోని ప్రతీ అక్షరం సాక్షాత్కరిస్తోంది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్.. ఇలా మూడు భాషల్లో ఆమె ప్రతీ చోట అక్షరమాలను సాక్షాత్కరిస్తూ సివి ల్స్‌కు సాధన చేసింది. తనలోని ప్రతీ భావాన్ని గోడ లు, కిటికీలు, తలుపులపై రాసి భద్రపరుచుకుంది. భావోద్వేగాలను సమన్వయపరుస్తూ అక్షరసుమాలను లిఖిస్తూ వాటి మధురిమలను ఆస్వాదిస్తూ సివిల్స్‌కు ప్రిపేర్ అయిన తీరు సివిల్స్ ఆశావహులందరికీ ఆచరణీయం.



సివిల్స్‌లో రాణించిన మరో అణిముత్యం

హెడ్ కానిస్టేబుల్ కుమారుడు విక్రమ్‌కు 814వ ర్యాంక్



గిర్మాజిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో ఓరుగల్లుకు మరో ర్యాంక్ దక్కింది. ఇప్పటికే ఆలిండియా 11, 46, 255 ర్యాంకులతో పాటుగా 814 ర్యాంక్ సాధించిన గంగాధరి విక్రమ్ కుడా హనుమకొండ వాసి కావడంతో ఈ ఏడాది సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన వారి సంఖ్యను నాలుగుకు పెరిగింది. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన పోలీసు హెడ్‌కానిస్టేబుల్ గంగాధరి సుదర్శన్-అరుణ దంపతుల కుమారుడు గంగాధరి విక్రమ్ మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా 814 ర్యాంకు సాధించారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో సెంట్రల్ ఇంటెలిజెన్స్‌లో సీఐగా పనిచేస్తున్న విక్రమ్.. మూడో ప్రయత్నంలో 814 ర్యాంక్ సాధించారు. హనుమకొండ సెయింట్ పీటర్స్ స్కూల్ టెన్త్ పూర్తి చేసిన విక్రమ్ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈసిఈ డిప్లొమా, కేయూ క్యాంపస్ కళాశాలలో 2015లో బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో బీటెక్ పూర్తి కాగానే న్యూఢిల్లీకి వెళ్లి సివిల్స్ కోచింగ్ తీసుకుని 2016లో సివిల్స్ రాయగా సక్సెస్ కాలేదు. ఆ తరువాత 2023లో సెంట్రల్ ఇంటలిజెన్స్‌లో సీఐగా సెలెక్ట్ అయి ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం చేస్తునే సివిల్స్ చేయాలనే పట్టుదలతో ఈసారి ప్రయత్నించి విజయం సాధించారు. ప్రస్తుతం వరంగల్ జీఆర్పీలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌కు విక్రమ్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ గూటికి పొనుగోటి

- 10 మంది మాజీ బీఆర్ఎస్ సర్పంచ్‌లతో భారీ చేరికలు
- బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు దయాకర్‌రావుకు షాక్
- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో చేరిక



ఇటీవల ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసిన సోమేశ్వర్ రావు

తొర్రూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు 20 సంవత్సరాలుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెన్నంటి ఉంటూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నేత డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు నేడు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. అతనితో పాటు తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ధరావత్ రాజేష్ నాయక్, మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు, నాయకులు సుమారు 500 మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు భారీ షాక్ తగలనుంది. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ముందు క్యాడర్ మొత్తం కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఎర్రబెల్లి కోటకు బీటలు వారనున్నాయి. సీనియర్ నాయకుడైన సోమేశ్వర్ రావు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ క్యాడర్ మొత్తం అయోమయానికి గురవుతున్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డిని ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వాల్యతండాలో చోరీ

దంతాలపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన వాల్యతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం. తండాకు చెందిన బానోతు మమత తన ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రిస్తున్న క్రమంలో మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును, రెండు సెల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుపోయాడు. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వాల్య తండాకు వెళ్లి దర్యాప్తు చేపడతామని ఎస్సై తెలిపారు.



మానుకోట మూడుకొట్ల సెంటర్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



గూడూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు



కేసముద్రంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పోలీసులు, నాయకులు

'పర్యాటకులను కాల్చిచంపడం హేయమైన చర్య'

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో పర్యాటకులను వారి కుటుంబసభ్యుల ఎదుటనే ఉగ్రవాదులు అతికిరాతకంగా కాల్చి చంపడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. కాశ్మీర్ ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతిచేకూరాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాసథియేటర్, జిల్లా అస్పత్రి, నెహ్రూసెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్మీదుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు అక్కడి పర్యాటక కేంద్రానికి వచ్చిన హిందువులను దారుణంగా కాల్చి చంపడం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, వెన్నమల్ల అజయ్, ఆకుల శ్రీనివాస్, వెన్నమల్ల సందీప్, గడ్డం అశోక్, పల్లె సందీప్, ఓర్సు పద్మావతి, దార ఇందుభారతి, రేష్మా, నరేష్‌నాయక్, జహేందర్‌నాయక్, డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లోని మూడుకోట్ల సెంటర్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వరిపల్లి వెంకన్న, తండ సందీప్, వెలుగు శ్రావణ్, మాలోతు రవీందర్, ప్రవీణ్, అశోక్, శ్యాంప్రసాద్, ప్రకాష్, రఫీ, వెంకటేష్, శ్రీను, రమేష్, యాకయ్య పాల్గొన్నారు.

● డోర్నకల్ రైల్వే సెంటర్ నుంచి గాంధీ సెంటర్ వరకు ప్రజలు కొవ్వొత్తులు, జాతీయ పతాకాలను చేబూని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుశీల్‌కుమార్ జైన్, జాటోతు మంగీలాల్, లకన్‌వ్యాస్, రెహమాన్, గణిపాక స్వామి, శ్రీనివాస్‌యాదవ్, యాకేష్ యాదవ్, చంద్రమోహన్, రమణ, జాన్‌వెస్లీ, రాంబాబు, హర్షవర్ధన్, సయ్యద్‌చాంద్‌పాష పాల్గొన్నారు.

● గూడూరులో హిందూ ఐక్యవేదిక, హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో తహసీల్ సెంటర్ నుంచి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పింగిలి శ్రీనివాస్, మేరెడ్డి సురేందర్, రాసమల్ల వెంకటేశ్వర్లు, రాంబాబునాయక్, అనిల్, శ్రీశైలం, లక్ష్మణ్, నరేష్, నాగరాజు, మల్లేష్, చెల్పూరి రాజు, రవి పాల్గొన్నారు.

● కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధాన్ని ఖండిస్తూ కేసముద్రంలో వివిధ పార్టీలు, పోలీసుల ఆధ్వర్యంలో పూలే విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, వోలం శ్రీనివాస్, మురళి, పొదిల నర్సింహారెడ్డి, తుంపిళ్ల శ్రీనివాస్, ఉప్పునూతల రమేష్, మాజీ జడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, బోగోజు నాగేశ్వచారి, మాసాడి సమ్మయ్య, రఫీఖాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● కాశ్మీర్ ఘటనపై కేసముద్రం గాంధీ విగ్రహం వద్ద ముస్లింలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు ఎండీ.అయూబ్‌ఖాన్, షేక్ జలాల్ షరీఫ్, గౌస్, హాషాం, ఇమాంఅలీ, షబ్బీర్, ఇబ్రహీం, చాంద్, పి.కుమార్ పాల్గొన్నారు.

● బయ్యారం, (ఆంధ్రజ్యోతి) : జమ్ముకాశ్మీర్ పెహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఉగ్ర దాడి వెనుక పాకిస్థాన్ కుట్ర దాగి ఉందని మండల బీజేపీ నేతలు ఆరోపించారు. ఉగ్రదాడిని నిరసిస్తూ బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాత్రి నేతలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. శ్రీనివాస్, వైవీఆర్ఎస్, శ్రీనివాస్‌రావు, నరేష్, కాంత్రి పాల్గొన్నారు.

● గార్ల మండల కేంద్రంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కమల్‌కుమార్ అగ్రవాల్, హతీరాంనాయక్, జంపాల వెంకన్న, వోబిలిశెట్టి కృష్ణ, శ్రీనివాస గుప్తా, పాల్తీయ కిషన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



రఫీకి మొక్కను అందిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మహ్మద్ అబ్దుల్ రఫీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ జడ్జి మహ్మద్‌అబ్దుల్ రఫీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 38 మంది జడ్జీలను బదిలీ చేయగా అందులో నారాయణపేట జిల్లా కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అబ్దుల్ రఫీని మహబూబాబాద్‌జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు సర్వయ్య, సత్యనారాయణ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై జీనత్‌కుమార్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

కురవి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్వేత



కురవి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కురవి తహసీల్దార్‌గా శ్వేత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్‌గా ఉన్న సునీల్‌రెడ్డి దంతాలపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గూడూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్వేత కురవి తహసీల్దార్‌గా నియామకమై బాధ్యతలు స్వీకరించారు.

సీరోలు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణ మూర్తి



శ్రీనివాసులు వెంకటనారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

సీరోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు వెంకట నారాయణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీరోలు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శారద గార్ల మండలానికి బదిలీపై వెళ్లగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్వీ నారాయణమూర్తి సీరోలు తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. విధుల్లో చేరిన శ్రీనివాసులు వెంకట నారాయణమూర్తికి కార్యాలయ ఉద్యోగులు యాకూబ్‌పాషా, వెంకన్న, నారాయణ, జ్ఞానేశ్వర్, సుమన్, బాలక్రిష్ణ, దీపక్, ఉపేందర్, ఉమేష్, ఎలెందర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'క్రీడలతో మానసికోల్లాసం'

గూడూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే శరీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ కుమారుడు నూనావత్ ధన్‌రాజ్ స్మారకార్థం లక్కీ సీజనల్ -2 టోర్నీ జిల్లా స్థాయి కార్క్‌బాల్ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడలను లింగారెడ్డి, మాజీ ఎంపీపీరమేష్‌నాయక్, డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. కాంగ్రెస్ మహబూబా బాద్ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, బీజేపీ మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు, సొసైటీ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండి.యాకూబ్‌పాషాపాల్గొన్నారు.



క్రికెట్ కిట్ బహూకరిస్తున్న సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి

'భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం'

నెల్లికుదురు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. నెల్లికుదురులోని రైతు వేదికలో బుధవారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతిచట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందుతాయన్నారు. వివిధ స్థాయిలలో నిర్ణీత సమయాలలో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కారం, మార్పులు చేర్పులు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాను సారం త్వరలో గ్రామసభలు నిర్వహిచడం జరుగుతుందన్నారు. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామాపరిపాలన అధికారులను, మండల సర్వేయర్‌లను నియమించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్‌డీవో గణేష్, తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● ఇనుగుర్తి, (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టంతో రైతులకు సంబంధించిన భూసమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రం రైతువేదికలో బుధవారం భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టంలో ఉచిత న్యాయసేవలు, వివిధ స్థాయిల్లో నిర్ణీత సమయంలో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మంచారి, ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

దంచికొడుతున్న ఎండలు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండలు భగ్గుమంటున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటేనే జనం భయంతో వణికిపోతున్నారు. ఉదయం 8 గంటల వరకే ఎండ వేడిమి మొదలై సాయంత్రం 6 వరకు తీవ్రత ఉంటోంది. ఇంట్లో ఫ్యాన్లు సరిపోక చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో చూద్దామన్న రోడ్లపై ఒక్కరు కూడా కన్పించక పోవడంతో దారులన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. వివాహాది శుభకార్యాలుండడంతో తప్పని పరిస్థితుల్లో జనం ఎండలో ప్రయాణాలు చేస్తూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శీతల పానీయాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. జిల్లాలో క్రమక్రమంగా వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మానుకోట జిల్లాలో ఈ నెల 21న కనిష్ఠ ఉష్ణోగ్రత 21.6 డిగ్రీలు, గరిష్ఠంగా 40.4 డిగ్రీలు, 22న కనిష్ఠంగా 25 డిగ్రీలు, గరిష్ఠంగా 41 డిగ్రీలు, 23న కనిష్ఠంగా 23.6 గరిష్ఠంగా 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదయ్యాయి. మరో మూడురోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, ఎండలో బయటకు వెళితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు సాయంతో బయటకు వెళ్లాలని, తమ వెంట తాగునీటిని ఉంచుకోవాలని చెబుతున్నారు. ఎండలో బయటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే సమాజ ప్రగతి

(5వ పేజీ తరువాయి)

ప్రవేశ పెట్టడంతో పాటు శ్రీగుంజేడు ముసలమ్మ పేరుతో బస్సును సైతం కేటాయించి బస్సుపై అధికారం ఇచ్చామని పేర్కొన్నారు. మహిళలకు పావల వడ్డీ రుణాలు ఇవ్వకుండా రూ.3500 కోట్లు బీఆర్ఎస్ ఎగ్గొట్టిపోయారని ఆరోపించారు. కొత్తగూడ మండల కేంద్రం అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి రోడ్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

కాశ్మీర్‌లో సాధారణ పౌరులైన పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడాలని ఏదేవుడు చెప్పలేదని, ఏ సిద్ధాంతంలో లేదని పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్ ఫలితాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ములుగు జిల్లా ఉండటం గర్వకారణమన్నారు. పోలారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య కుమారుడి వివాహానికి హజరైన మంత్రి సీతక్క, ఆమె కుమారుడు, కోడలు కుంజ సూర్యారామ్, కుసుమాంజలి వధువరులను ఆశీర్వాదించారు. కోనాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని లెక్కల భాస్కరరెడ్డి-శ్వేత దంపతుల కూతురు అవంతిక ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడోర్యాంక్ సాధించగా, ఆమెను మంత్రి అభినందించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మధుసూదన్ రాజు అడిషనల్ డీఆర్‌డీవో జయశ్రీ, డీపీఎం నళిని, ఏపీఎం గుళ్లపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ ఎంపీపీ బానోత్ విజయ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, మాజీ జడ్పీటీసీ పుష్పలత, జిల్లా నాయకుడు లావణ్య వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, మాజీ సర్పంచ్‌లు రణధీర్, వజ్జ వెంకటలక్ష్మీ సురేందర్, ఏఎంసీ డైరెక్టర్ బొల్లు రమేష్ పాల్గొన్నారు.

సూర్యాపేట నుంచి ఎడ్లబండ్లపై బీఆర్ఎస్ సభకు..

- దంతాలపల్లిలో స్వాగతం పలికిన సత్యవతిరాథోడ్



కుమ్మరికుంట్లలో ఎడ్లబండిపై మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

దంతాలపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూర్ మండలం నర్సంపేట, రామోజీతండా, ఆత్మకూర్ రైతులు ఎడ్లబండ్లపై బయలు దేరారు. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల వద్దకు బుధవారం ఈ ఎడ్లబండ్ల ర్యాలీ చేరడంతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి అరటిపండ్లు అందజేశారు. కేసీఆర్ పాలనలో రైతులకు చేసిన మేలును గురించి కొద్దిసేపు రైతులతో ముచ్చటించారు. ఎండ ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకొని సభాస్థలికి చేరుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఎడ్లబండిపై ఎక్కి కొంతదూరం ప్రయాణించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో నర్సింహులపేట బీఆర్ఎస్ నాయకులు బండ భిక్షంరెడ్డి, మాధ వెంకన్న, గండి సతీష్, లింగయ్యగౌడ్, యాకన్న, ఆత్మకూర్ రైతులు బొల్లా వెంకట్‌రెడ్డి, తంగెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, గంధం నర్సయ్య, మధుసూదన్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుంది

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట నియోజకవర్గం రజతోత్సవ సభకు వెళ్తున్న రైతుల ఎడ్లబండ్లకు స్వాగతం పలికి ఎడ్లబండి నడిపి, ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలన్నారు. ప్రజలకు ఆరు గ్యారంటీలు అమలుచేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ కోసం ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని, ఇప్పటికే సభ విజయవంతం అయిందని, ప్రతీ గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, బిందు శ్రీను, ప్రదీప్ రెడ్డి, కుర్ర శ్రీను పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : మహిళలకు గాయాలు

చిన్నగూడూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను కారు ఢీకొట్టిన సంఘటన బుధవారం చిన్నగూడూరు పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం యాచారానికి చెందిన శ్రీనివాస్ నడుపుతున్న కారు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం నారాయణపురానికి చెందిన అనిత బైక్‌ను చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల మధ్య ఢీకొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. కాగా, డ్రైవర్ మహిళను ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మండల కేంద్రంలో కారు పంచర్ కావడంతో విషయం బయటకొచ్చింది. గమనించిన స్థానికులు అంబులెన్స్ ద్వారా మహిళను ఏరియా ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కారు డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణుల పేర్లు నమోదు చేయాలి

మరిపెడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలు నిండిన గర్భిణులను ఆయా గ్రామాల ఆరోగ్య సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మరిపెడ మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి అన్నారు. బుధవారం మరిపెడ పీహెచ్‌సీలో ఆయన వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం అయ్యే విధంగా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. వడ దెబ్బపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. బీపీ, షుగర్ పేషెంట్లకు మందులు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. పీహెచ్ఎన్‌వో మంగమ్మ, సూపర్‌వైజర్ కృష్ణ, సుదర్శన్, మాధవి, లక్ష్మి, అఖిల, ఉపేంద్ర, సిరి, ఝాన్సీ, సతీష్, సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ట్రాలీ, ద్విచక్రవాహనం ఢీకొని

ఇద్దరు బాలికలు దుర్మరణం



మృతి చెందిన నవ్య, మౌనిక

కొత్తగూడ, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల కుమార్తెలు మృతి చెందగా, ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన పెగడపల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీపురానికి చెందిన జంగా సంపత్-ఏలేంద్ర కూతురు మౌనిక (18), ఎల్లయ్య-రజిత కూతురు నవ్య (17)సమీప బంధువైన యువకుడితో ద్విచక్రవాహనంపై లక్ష్మీపురం నుంచి కొత్తగూడకు వస్తున్నారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన గుండ్రపల్లి కర్ణాకర్ ట్రాలీ ఆటోతో కొత్తగూడ నుంచి లక్ష్మీపురానికి వెళ్తున్నాడు. పెగడపల్లి కొత్తపల్లి దారిలో ద్విచక్రవాహనం, ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఇద్దరు యువతులు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ట్రాలీ ఆటో డ్రైవర్, ద్విచక్రవాహనంపై ఉన్న యువకుడికి తీవ్ర గ్రాయాలు కావడంతో 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. అన్న దమ్ముల కూతుర్లు మృతి చెందడంతో లక్ష్మీపురంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి

కురవి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో విద్యుదాఘాతంతో జర్పుల చిలకమ్మ(62) అనే వృద్ధురాలు విద్యుదాఘాతంతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చిలకమ్మకు చుట్టతాగే అలవాటు ఉంది. బుధవారం ఉదయం తెల్లవారు జామున ఇంట్లోని రేకుల కింద చుట్టను తీసుకునే క్రమంలో చిలకమ్మ విద్యుదాఘాతంకు గురైంది. ఫ్యాన్ వైరుతెగి రేకులపై పడి విద్యుత్ ప్రసారం జరగడంతో విద్యుదాఘాతంతో చిలకమ్మ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను మహబూబాబాద్ జిల్లా అస్పత్రికి తరలించగా అప్పటికే చిలకమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు చెప్పారు. కుమారుడు అగ్గి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు



భూక్య ఈశ్వర్ (ఫైల్)

కురవి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచర్ల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలెంపల్లి తండాకు చెందిన భూక్య ఈశ్వర్ (17) అనే యువకుడు మృతి చెందాడు. కురవి ఏఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఈశ్వర్ తన తల్లి సుజాత, తమ్ముడు ప్రభాస్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి మహబూబాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరు పోలెంపల్లి తండాకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ముందు వెళ్తున్న కోళ్ల వ్యాను సడన్‌బ్రేక్ వేయడంతో ఈశ్వర్ ద్విచక్రవాహనం అదుపుతప్పి కోళ్లవ్యాను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఈశ్వర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. అదే ద్విచక్రవాహనంపై ఉన్న తల్లి సుజాత స్వల్పగాయాలు కాగా, తమ్ముడు ప్రభాస్‌కు సైతం గాయాలయ్యాయి. మృతుడు ఈశ్వర్‌తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కురవి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువకుడిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : యువకుడిపై దాడి చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ దేవేందర్ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్‌లోని వెంకట్రామథియేటర్ సమీపంలో మల్లేష్, మురళి, చిరంజీవిలు బైక్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఉండగా రెడ్యానాయక్ కాలనీకి చెందిన మక్కల్ల తరుణ్ అటుగా వచ్చి బైక్‌ను కొంచెం తీయాలని రిక్వెస్ట్ చేశాడు. దీంతో కొప్రోదికులైన ముగ్గురు యువకులు తమ చేతిలో ఉన్న బీర్‌సీసాలతో తరుణ్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో తరుణ్ తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం తరుణ్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. తరుణ్‌తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

